కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు

- రాంపురం రైతులు, గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - మందస (శ్రీకాకుళం జిల్లా)

కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి రాంపురం గ్రామ రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తవమని బాధిత రైతులు, గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఇకనైనా మానుకోవాలని, తాము భూములు ఇచ్చే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పారు. ఈ మేరకు గ్రామంలో శనివారం నిరసన తెలిపారు. 20 నెలలుగా పచ్చని ఉద్దాన భూముల్లో ఎయిర్ పోర్టు నిర్మాణం వద్దంటూ తాము అనేక విధాలుగా నిరసనలు తెలియజేస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. ఈ విషయం కలెక్టర్, ఎమ్మెల్యే గౌతు శిరీష, ఇతర అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు స్పష్టంగా వివరించామన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న ఈ భూములు నిత్యం ఆదాయాన్నిచ్చే కొబ్బరి, జీడిమామిడి, పనస, మునగ, మామిడి తోటలతో పాటు, మూడు పంటలు పండే అత్యంత సారవంతమైనవని తెలిపారు. ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు పండించే ఇలాంటి 'బంగారు భూములను' ఎయిర్ పోర్టు పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి, తమ పొట్ట కొట్టవద్దన్నారు.

ఇకనైనా అధికారులు, పాలకులు తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. నిరసన కార్యక్రమంలో బాధిత రైతులు దున్న రామారావు, మర్ల సంతోష్, జుత్తు భూపతి, తమాడ వాసు, జుత్తు జోగారావు, దున్న సురేష్, తామాడ ఎర్రయ్య, కీలు కాంతారావు, కోయిల రామస్వామి, మర్ల సూర్యనారాయణతో పాటు మహిళా రైతులు, యువకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రాంపురం రైతులు, గ్రామస్తులు

సచివాలయ ఉద్యోగాల పేరుతో వ్యవస్థీకృత కుట్ర

- బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో 2019లో జరిగిన సచివాలయ నియామకాల్లో భారీ అక్రమాలు జరిగాయని, అర్హులైన లక్షలాది మంది నిరుద్యోగుల పొట్టగొట్టి తమ సొంత కేడర్‌కు ఉద్యోగాలిచ్చుకున్నారని టిడిపి అధికార ప్రతినిధి, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ విమర్శించారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నైతికత, ప్రతిభ గురించి మాట్లాడే కనీస అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కలలను సాకారం చేస్తూ అత్యంత పారదర్శకంగా మెగా డిఎస్‌సి నిర్వహిస్తే, ఓర్వలేక రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం బురదజల్లే ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 సచివాలయ నియామకాలపై ఎలాంటి ఆరోపణలు లేవని, అంతా సక్రమంగానే జరిగిందని డబ్బా మాటలు చెప్పుకుంటున్న జగన్, నాటి వ్యవస్థీకృత కుంభకోణంపై వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. యుపిఎస్‌సి, సివిల్స్ కంటే క్లిష్టంగా ఉందన్న పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-5 పరీక్షల్లో 150 మార్కులకు 112.25 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన జి అనితమ్మ ఎపిపిఎస్‌సి కార్యాలయంలో ఎగ్జామ్ సెక్షన్‌లో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కాదా? అని ప్రశ్నించారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటుపై హర్షం

- అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. విజయవాడలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ కంపెనీ 1995లో విజయవాడ కేంద్రంగా ఏర్పాటుచేసి 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది పేద, మధ్యతరగతి రిటైర్డ్ ఉద్యోగుల నుండి రూ.7 వేల కోట్లు వసూలు చేసిందని తెలిపారు. 2014 చివరి మాసాల్లో బోర్డు తిప్పేసి కంపెనీ ఆర్థిక దోపిడీకి పాల్పడి వందలాది మంది ఆత్మహత్యలకు కారణమైందన్నారు. ఈ మేరకు 12 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ పోరాటంతో అగ్రిగోల్డ్ సమస్యపై ప్రత్యేక కోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. త్వరలో ఐదుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు షరీఫ్, ఎస్‌కె బాషా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

- వేధింపులే కారణమని ఆరోపణ
- పరామర్శించిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కూటమి నేతల వేధింపులు తాళలేక ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ చీకట్ల వేదకుమారి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం ఆమె జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 48 గంటల వరకూ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు. పోలీసులకు బాధితురాలు తెలిపిన వివరాల మేరకు... మూడు నెలల క్రితం అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు పాడయ్యాయనే విషయంలో అదే గ్రామానికి చెందిన కూటమి కార్యకర్తలు చాబత్తుల శ్రీకాంత్, ఆయన భార్య చాబత్తుల కుమారితో వివాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత నుంచి వేద కుమారిని చాబత్తుల శ్రీకాంత్‌తో పాటు అతని బంధువులైన చాబత్తుల సుబ్బారావు, కట్టూరి యువరాజు, కర్రిపోతు హరీష్, గోలి అనిల్, చొక్కా రాజేష్ తనను నిరంతరం వేధించేవారు. ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఆమె ఇంటి విద్యుత్ వైర్లను కత్తిరించడం, ఉన్నతాధికారులకు, పోలీసు స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు చేయడం ద్వారా మానసికంగా ఇబ్బందులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో మరోసారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. శనివారం మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో దేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో దోమల (మలాథియన్) మందు తాగి, తన అక్క పసుపులేటి నిర్మల కుమారికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో ఆమె హుటాహుటిన చెల్లెలు వద్దకు చేరుకుని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు ఆసుపత్రికి చేరుకుని బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్.లింగరాజు మాట్లాడుతూ.... వేదకుమారిని వేధింపులకు గురిచేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శిస్తున్న ఆర్ లింగరాజు

తిరుమలలో కిక్కిరిసిన యాత్రికుల రద్దీ

- గోగర్భం డ్యామ్ వరకు క్యూలైన్లు
- శనివారం మధ్యాహ్నం క్యూలలోకి అనుమతి నిలిపివేత

ప్రజాశక్తి-తిరుమల

వేసవి సెలవులు ముగుస్తుండటం, వారంతపు సెలవులు కావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు యాత్రికులు తిరుమలకు తరలి వస్తున్నారు. దీంతో టోకెన్లు లేకుండా స్వామివారి ఉచిత దర్శనానికి వచ్చిన యాత్రికులతో కంపార్టుమెంట్లన్నీ నిండిపోయాయి. గోగర్భం డ్యామ్ వరకూ క్యూ లైన్లు బారుతీరాయి. దర్శనం విషయంలో సామాన్య యాత్రికులకు టిటిడి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో టిటిడి అధికారులు శనివారం మధ్యాహ్నం యాత్రికులను క్యూలైన్లలోకి అనుమతి నిలిపివేశారు. రద్దీ తగ్గిన వెంటనే పంపిస్తామని తెలిపారు. టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి పర్యవేక్షణలో అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం ఎనిమిది గంటల్లోపు క్యూ లైన్లో ఉన్న యాత్రికులకు దర్శనానికి 24 గంటల సమయం పడుతోందని తెలిపారు. సర్వదర్శనం, దివ్యదర్శనం టోకెన్లు ఉన్న వారికి 10-15 గంటల సమయం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు ఉన్న వారికి 8-10 గంటలు పడుతోంది. శుక్రవారం స్వామివారిని 74,636 మంది దర్శించుకోగా.. 43084 మంది స్వామివారికి తలనీలాల మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 4.21 లక్షల లడ్డులు కొనుగోలు అయ్యాయని, 3.18 లక్షల మందికి శ్రీవారి అన్నప్రసాద అందించామని, యాత్రికులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.64 కోట్లు సమకూరిందని టిటిడి తెలిపింది.

గురుకులాల్లో పార్ట్ టైమ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అనేకేళ్లుగా సేవలందిస్తున్న పార్ట్ టైమ్, గెస్ట్ టీచర్ల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని, 1,860 కుటుంబాలకు జీతాలు సకాలంలో చెల్లించి ఆదుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామికి సంఘం ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి శనివారం లేఖ రాశారు. పేరుకు పార్ట్ టైమ్ టీచర్లు అయినప్పటికీ, వారు రెగ్యులర్ టీచర్లతో సమానంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించడమే కాకుండా ఉదయం డ్యూటీలు, నైట్ స్టేలు, లేట్ నైట్ స్టడీస్, జనరల్ స్టడీస్, హౌస్ డ్యూటీలు, క్లాస్ టీచర్ బాధ్యతలు వంటి అనేక విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత, నెలనెలా జీతాలు సకాలంలో రాకపోవడం, వేతనాల్లో పెరుగుదల లేకపోవడం, ప్రతి సంవత్సరం మౌఖికంగా మాత్రమే రెన్యువల్ చేయడం వంటి పరిస్థితులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పార్ట్ టైమ్, గెస్ట్ టీచర్లకు స్పష్టమైన డ్యూటీ చార్ట్ ప్రకటించాలని తెలిపారు. గతంలో పార్ట్ టైమ్ టీచర్లను రెగ్యులర్ చేసిన విధానాలను పరిశీలించి వీరికి కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కనీసం కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా సేవలను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని కోరారు.

కల్తీ మద్యంతో 30 వేల మంది బలి

- మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంపూర్ణ మద్య నిషేధం చేస్తానని, మద్య నిషేధం చేయకపోతే ఎన్నికల్లో ఓట్లు కూడా అడగనని చెప్పిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ హామీకి ఘోరంగా వెన్నుపోటు పొడిచారని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సొంత బ్రాండ్లను ప్రజల నెత్తిన రుద్ది, నాణ్యత లేని కల్తీ, నకిలీ మద్యంతో దాదాపు 30 వేల మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. దీనివల్ల ఎంతో మంది ఆడబిడ్డల పుస్తెలు తెగిపోయాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో దోపిడీ చేసి, దాదాపు రూ.3,500 కోట్ల భారీ మద్యం స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం తన హయాంలో 85 శాతం హామీలకు ఎగనామం పెడితే, కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే 90 శాతానికి పైగా హామీలను విజయవంతంగా అమలు చేసి చూపిందన్నారు.

రూ.3,500 కోట్లు దోచుకున్నారు : మంత్రి డోలా

వైసిపి హయాంలో మద్యం కుంభకోణంలో రూ.3,500 కోట్లు దోచుకున్నారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. మద్యాన్ని పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని పేర్కొన్నారు. మద్యం డిపోల నుంచి మద్యం దుకాణాలకు ఉన్న ఛార్జీలు రూ.13 నుంచి రూ.35కు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఈ మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు వైఎస్ జగన్ అని ఆరోపించారు.

పోలీసులకు పేర్ని నాని క్షమాపణ చెప్పాలి

- ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్‌శాఖ సంక్షేమంపై మాజీ మంత్రి పేర్ని నాని నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకొని, పోలీసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల రాష్ట్ర సంఘం డిమాండ్ చేసింది. పోలీస్‌శాఖ సంక్షేమంపై సరైన అవగాహన లేకుండా, పేర్ని నాని నిరాధారమైన అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర అధక్షులు జనకుల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. పోలీస్‌శాఖలో ఆర్డర్లీ విధానం 1979లోనే జిఓ ఎంఎస్ నెంబరు 612 మేరకు రద్దు చేసిన విషయం తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర పోలీస్ సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ఏడాది దాదాపు రూ.430 కోట్లు బకాయిలు చెల్లించి రెండు అడిషనల్ సరెండర్ లీవులను మంజూరు చేశారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో కేవలం నాలుగు సరెండర్, అడిషనల్ సరెండర్ లీవ్ బకాయిలు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పోలీస్ శాఖలో ఎపిఎస్‌పి విభాగంలో పెండింగ్‌లో ఉన్న 300 మంది హెడ్ కానిస్టేబుళ్లకు, ఎఆర్ ఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతులు కల్పించి, 113 మంది ఎపిఎస్‌పి కానిస్టేబుళ్లను ఎఆర్ వింగ్‌కి కన్వర్షన్‌పై పంపుతూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను పరిశీలించుకోవాలని తెలిపారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్‌ను బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి శనివారం విజ్ఞప్తి చేసింది. రాయలసీమ అభివృద్ధికి, యువత ఉద్యోగ అవకాశాలకు డివిజన్ ఏర్పాటు అవసరమని, తిరుచానూరు, చంద్రగిరి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కోరింది. విజయవాడ-గూడూరు ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతికి పొడిగించాలని విన్నవించింది. తిరుపతి నుండి విశాఖ, మైసూర్, కోయంబత్తూర్, మదురై, విజయవాడ -బెంగళూరు మధ్య వందేభారత్ ట్రెయిన్‌ను నడపాలని కోరింది. పాకాలలో ఎలక్ట్రిక్ లోకో షెడ్, జోనల్ సిబ్బంది ట్రైనింగ్ సెంటర్ పిట్ లైన్స్ ఏర్పాటు చేయాలంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ఉండడం వల్ల ఇక్కడ పండించే పంటలు, కూరగాయలు ఇతర రాష్ట్రాలకు రవాణా చేసుకున్న సౌకర్యం లేదని, తిరుపతి తూర్పు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా రైళ్లు నడపడంలేదని, ఒక ప్రత్యేక రైలు నడపాలన్నా ఈ స్టేషన్లో తగినంత స్థలం లేదని, పడమర రైల్వే స్టేషన్‌తో పాటు తిరుచానూరు, రేణిగుంట, చంద్రగిరి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా రైలు నడపాలని కోరింది. తిరుపతి కాట్పాడి మార్గంలో విద్యుద్దీకరణ పనులతో పాటు డబుల్ లైన్ వేయాలని విన్నవించింది. తిరుపతి -విశాఖ మరిన్ని అదనపు రైళ్లు నడపాలని, తిరుపతి హైదరాబాదు, తిరుపతి విజయవాడ, తిరుపతి చెన్నై మధ్య మరిన్ని రైలు నడపాలని కోరింది. తిరుపతికి వచ్చిన సందీప్ మాథూర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్‌తో పాటు ఎం వేణుగోపాల్ రెడ్డి, సూరినేని బుజ్జి, బాబు నాయుడు, పుష్ప రాజ్, లోకనాధం, అనీల్, నాగేంద్ర ఉన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్ తనిఖీ చేస్తున్న రైల్వే జిఎం

వడ్డీ రేట్లు పెరగొచ్చు..!

- ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరొచ్చు
- ఐసిఐసిఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ రిపోర్ట్

న్యూఢిల్లీ:

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, దేశంలో సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న రుతుపవనాల కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో దేశీయ ద్రవ్యోల్బణం 5 శాతానికి పెరిగే ప్రమాదం ఉందని ఐసిఐసిఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ ఓ నివేదికలో హెచ్చరించింది. ఈ ఆహార, ఇంధన ధరల ముప్పును అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తన కీలక వడ్డీ రేట్లను మరో 50 నుండి 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచే అవకాశం ఉందని విశ్లేషించింది. గడిచిన మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 16 నెలల గరిష్ట స్థాయి అయిన 3.94 శాతానికి చేరగా.. ఇందులో ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణం 4.8 శాతానికి, ఇంధన ద్రవ్యోల్బణం 1.9 శాతానికి పెరగడం ఆందోళకరం. తీవ్రమైన ఎండల కారణంగా మే నెలలో కూరగాయల ద్రవ్యోల్బణం 10 నెలల గరిష్ట స్థాయి అయిన 5.7 శాతానికి చేరగా.. నెలవారీగా టమోటాలు 26 శాతం, క్యాలీఫ్లవర్ 12 శాతం ప్రియమయ్యాయి. వీటితో పాటు పప్పుధాన్యాలు, వంటనూనెలు, ఇంధన ధరలు పెరగడం, రెస్టారెంట్ సేవలు, దుస్తుల ధరలు అధికమవడం వల్ల కోర్ ద్రవ్యోల్బణం కూడా 2.4 శాతానికి చేరింది. సాధారణం కంటే 10 శాతం తక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ముమ్ముందు పంటల దిగుబడి తగ్గి ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ సవాళ్లు త్వరగా ముగియకపోతే ఆర్‌బిఐ వడ్డీ రేట్ల పెంపు వైపే మొగ్గు చూపే అవకాశం ఉందని ఈ నివేదిక హెచ్చరించింది. ఇప్పటికే దేశంలో అధిక ధరలు ప్రజల కొనుగోలు శక్తిని హరించి వేస్తున్నాయి. దీంతో అనేక ఉత్పత్తులకు డిమాండ్ పడిపోతోంది. ఈ క్రమంలో ధరలు మరింత పెరిగితే ప్రజలు తీవ్ర అప్పుల పాలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టిటిడి సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల

సెప్టెంబర్ నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, వసతి గదుల కోటాల విడుదల షెడ్యూల్‌ను టిటిడి శనివారం ప్రకటించింది. శ్రీవారి దర్శనం కోసం ముందస్తుగా ప్రణాళికలు వేసుకునే యాత్రికులు నిర్ణీత తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవలకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను జూన్ 18న ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్‌లో పాల్గొనదలచిన యాత్రికులు జూన్ 20 ఉదయం పది గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఎంపికైన యాత్రికులు జూన్ 20 నుంచి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు చెల్లింపులు పూర్తి చేస్తే టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవల టికెట్లను జూన్ 22న ఉదయం పది గంటలకు టిటిడి విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచనుంది. అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను జూన్ 23న ఉదయం పది గంటలకు, శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను ఉదయం 11 గంటలకు విడుదల చేయనుంది. వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న యాత్రికుల కోసం ప్రత్యేక ఉచిత దర్శన టోకెన్ల కోటాను అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు విడుదల చేయనుంది. సెప్టెంబర్ నెల ప్రత్యేక ప్రవేశ దర్శన రూ.300 టికెట్ల కోటాను జూన్ 24న ఉదయం పది గంటలకు విడుదల చేస్తుండగా, తిరుమల, తిరుపతిలోని వసతి గదుల కోటాను అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనుంది. యాత్రికులు దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్ కోసం టిటిడి అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే వినియోగించాలని అధికారులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్లు, మధ్యవర్తులను నమ్మవద్దని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

పేదల సొంతింటి కల సాకారం చేస్తాం

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు రూరల్

పేదల సొంతింటి కల సాకారం చేస్తామని, అర్హులందరికీ న్యాయం చేస్తామని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శనివారం వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం హౌసింగ్ లే అవుట్‌ను ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డితో కలిసి సందర్శించిన మంత్రి అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో హౌసింగ్ పథకం అమలులో అనేక అవకతవకలు జరిగాయని, లబ్ధిదారుల ఎంపిక, ప్లాట్ల కేటాయింపు, గృహ నిర్మాణాల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. మెప్మా మహిళా సంఘాలకు సంబంధించిన నిధుల వినియోగంలో సుమారు రూ.48 కోట్ల మేర గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. అనంతరం ప్రొద్దుటూరు ఆర్ అండ్‌బి అతిథి గృహంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్‌డిఒ శిరీష, హౌసింగ్ సిఇ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడీ రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

టిటిడికి ట్రక్కు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

ప్రముఖ వాహన తయారీ సంస్థ అశోక్ లేలాండ్ లిమిటెడ్ శనివారం టిటిడికి రూ.31,72,532 విలువైన ట్రక్కును విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి టిటిడి అదనపు ఇఒ సిహెచ్.వెంకయ్య చౌదరికి ట్రక్కు తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ట్రాన్స్‌పోర్టు ఇన్‌ఛార్జ్ జిఎం.లక్ష్మీ ప్రసన్న, తిరుమల డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

విరాళం ఇస్తున్న ధాత

ఎలాన్ మస్క్ సంపద రూ.100 లక్షల కోట్లు..

- వాల్ స్ట్రీట్‌లో స్పేస్‌ఎక్స్ సరికొత్త చరిత్ర
- టాప్ 4 కుబేరుల సంపద కంటే ఎక్కువ

న్యూయార్క్ :

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించారు. ఇది లక్ష కోట్ల డాలర్లు లేదా సుమారు రూ.100 లక్షల కోట్లకు పైగా సంపదకు సమానం. ఇప్పటివరకు ఈ స్థాయి సంపదకు చేరిన ఏకైక వ్యక్తి మస్క్ మాత్రమే. మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ స్పేస్‌ఎక్స్ వాల్ స్ట్రీట్ స్టాక్ మార్కెట్‌లో కొత్త చరత్ర సృష్టించింది. ఎస్‌పిసిఎక్స్ టిక్కర్‌తో నాస్‌డాక్‌లో రంగప్రవేశం చేసిన ఈ సంస్థ.. ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ ద్వారా రికార్డు స్థాయిలో 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.7 లక్షల కోట్లు) నిధులను సమీకరించడమే కాకుండా.. తొలిరోజే షేరు ధర 19 శాతం లాభంతో160.95 డాలర్ల వద్ద ముగిసింది. ఈ భారీ జంప్‌తో స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ 2.1 ట్రిలియన్ డాలర్లకు చేరడంతో అమెరికాలోనే ఆరో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా ఆవిర్భవించింది. ఇదే సమయంలో ఎలాన్ మస్క్ వ్యక్తిగత సంపద 1.11 ట్రిలియన్లకు (సుమారు రూ. 104 లక్షల కోట్లు) చేరుకోవడంతో ప్రపంచ చరిత్రలోనే అధికారికంగా ఒక ట్రిలియన్ డాలర్ల మార్కును దాటిన మొట్టమొదటి వ్యక్తిగా (ట్రిలియనీర్) మస్క్ సరికొత్త ప్రపంచ రికార్డును సృష్టించారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం.. ఎలాన్ మస్క్ ఒక్కడి సంపదే ఇప్పుడు ప్రపంచంలోని తర్వాతి నలుగురు అగ్ర కుబేరులైన జెఫ్ బెజోస్, లారీ పేజ్, సెర్గీ బ్రిన్, లారీ ఎల్లిసన్ల ఉమ్మడి ఆస్తుల విలువ (1.089 ట్రిలియన్లు) కంటే ఎక్కువగా 1.11 ట్రిలియన్లుగా ఉండటం విశేషం. స్పేస్‌ఎక్స్ సంస్థ 2025 సంవత్సరానికి గానూ 18.67 బిలియన్ల ఆదాయాన్ని ఆర్జించినప్పటికీ 4.94 బిలియన్ల నికర నష్టాన్ని చవిచూసింది. అయినప్పటికీ శాటిలైట్ బ్రాడ్‌బాండ్ స్టార్‌లింక్, అంతరిక్ష ప్రయోగాలు, రక్షణ రంగ కాంట్రాక్టులు, కృత్రిమ మేధస్సు రంగాల్లో ఈ కంపెనీకి ఉన్న ఉజ్వల భవిష్యత్తుపై నమ్మకంతో ఇన్వెస్టర్లు మొదటి రోజే 50 కోట్లకు పైగా షేర్లను ట్రేడ్ చేశారు. కాగా.. ఈ ఐపిఒ తర్వాత కూడా క్లాస్ బి షేర్ల ద్వారా కంపెనీలోని దాదాపు 82.4 శాతం ఓటింగ్ హక్కులు ఎలాన్ మస్క్ నియంత్రణలోనే కొనసాగనున్నాయి.

ఫారం-జి

ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానం
వివిమెడ్ ల్యాబ్స్ లిమిటెడ్
హైదరాబాద్, హరిద్వార్, కాశీపూర్ మరియు బీదర్‌లలో ఫార్మా దోసేజ్ రూపాల తయారీ వ్యాపార కార్యకలాపాలు.
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డు ఆఫ్ ఇండియా (ఇన్సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ యొక్క సబ్-రెగ్యులేషన్ (1) క్రింద)

క్ర. సం.	సంబంధిత వివరాలు	
1	కార్పొరేట్ డెటార్ పేరు PAN మరియు CIN/ LLP నెం.తోసహా	వివిమెడ్ ల్యాబ్స్ లిమిటెడ్ PAN: AAACV6060A CIN: L02411KA1988PLC009465
2	రిజిష్టర్డు ఆఫీసు చిరునామా	ప్లాట్ నెం.78-ఏ, కొల్హార్ ఇండస్ట్రియల్ ఏరియా, బీదర్, కర్ణాటక-585403
3	వెబ్‌సైట్ యొక్క యూఆర్ఎల్	https://www.vivimedlabs.com/
4	స్థిరా ఆస్తులు మెజారిటీ ఉన్న స్థలం వివరాలు	ఎ) హైదరాబాద్, తెలంగాణలోని తయారీ కేంద్రాలు - 2 యూనిట్లు **1) ఫార్మా యూనిట్** - డి.125 & 128, ఫేజ్ 3, ఐ.డి.ఎ. జీడిమెట్ల గ్రామం, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం-500 055 **2) ఫార్మా యూనిట్** - ప్లాట్ నెం.8, ఫేజ్ 5, ఐడిఏ జీడిమెట్ల, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ, బి) ఉత్తరాఖండ్‌లో తయారీ సౌకర్యాలు - 2 యూనిట్లు **3) ఫార్మా యూనిట్:** ప్లాట్ నెం.25, కుందేశ్వరి గ్రామం, కాశీపూర్ -244713 **4) ఫార్మా యూనిట్ (లీజుకు తీసుకున్న ప్రాంగణం)** - డి-9, 10, ఓల్డ్ ఇండస్ట్రియల్ ఏరియా, హరిద్వార్, ఉత్తరాఖండ్, 249401 సి) బీదర్, కర్ణాటకలో తయారీ సౌకర్యం -1 యూనిట్ 1) ప్లాట్ నెం.78-ఏ, కొల్హార్ ఇండస్ట్రియల్ ఏరియా, బీదర్, కర్ణాటక -585403 (నాన్-ఆపరేషనల్) డి) పైడిభీమవరం, ఆంధ్రప్రదేశ్‌లోని స్థిరాస్తి, (సెక్యూర్డ్ ఫైనాన్సియల్ క్రెడిటార్‌కు సమర్పించిన సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ప్రకారం)
5	ప్రధాన ఉత్పత్తులు/ సర్వీసుల ఇన్‌స్టాల్ చేసిన సామర్థ్యం	సస్పెండ్ చేయబడిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నాకు అందించిన సమాచారం ప్రకారం, స్థాపించబడిన సామర్థ్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: . టాబ్లెట్లు: 900 మిలియన్లు . క్యాప్సూల్స్: 580 మిలియన్లు . టాపికల్స్: 71 మిలియన్లు . ఓరల్స్: 12 మిలియన్లు. ఆప్తాల్మిక్స్ : 22.5 మిలియన్లు
6	చివరి ఆర్థికసంవత్సరంలో విక్రయించిన ప్రధాన ఉత్పత్తులు/సర్వీసుల పరిమాణం& విలువ	మొత్తం (రూ.) కోట్లలో వివరాలు / FY 2024-25 / FY 2023-24 కార్యకలాపాల ద్వారా ఆదాయం / 103.60 / 136.80 (ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికల ప్రకారం) గమనిక: 1) మార్చి 31, 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను వివిమెడ్ ల్యాబ్స్ లిమిటెడ్ యొక్క చట్టబద్ధమైన ఆడిట్ ప్రస్తుతం జరుగుతోంది మరియు ఈ ఫారం-జి ప్రచురణ తేదీ నాటికి సదరు ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ చేయబడిన ఆర్థిక నివేదికలు తదనుగుణంగా ఖరారు కాలేదు. 2) డిసెంబర్ 31, 2025తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి కార్యకలాపాల ద్వారా రాబడి రూ.48.23 కోట్లుగా ఉంది. (స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన, డిసెంబర్ 31, 2025తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాల ప్రకారం) 3) మరిన్ని వివరాల కోసం ఈ క్రింది ఇమెయిల్ చిరునామాకు పంపవచ్చు: at: cirp.vivimedlabslimited@hotmail.com
7	ఉద్యోగులు/ కార్మికుల సంఖ్య	552 (సస్పెండ్ చేయబడిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు అందించిన సమాచారం ప్రకారం)
8	చివరి రెండు సంవత్సరాలకు సంబంధించిన ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో సహా) మరియు రుణదాతల జాబితాలతో సహా మరిన్ని వివరాలు ఈ URL లో అందుబాటులో ఉన్నాయి:	ఆర్థిక నివేదికలు: https://www.vivimedlabs.com/financials/ List of Creditors:https://ibbi.gov.in/claims/claim-process/L02411KA1988PLC009465 తదుపరి వివరాల కోసం ఈ ఈమెయిల్‌కు పంపండి: email at: cirp.vivimedlabslimited@hotmail.com
9	9.కోడ్‌లోని సెక్షన్ 25(2)(హెచ్) ప్రకారం రిజల్యూషన్ దరఖాస్తుదారులకు సంబంధించిన అర్హత వివరాలు ఈ URLలో అందుబాటులో ఉన్నాయి:	దీనికి ఈమెయిల్ పంపడం ద్వారా పొందవచ్చు cirp.vivimedlabslimited@hotmail.com
10	ఆసక్తి వ్యక్తీకరణకు స్వీకరణకు చివరి తేది	29/06/2026
11	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారుల ప్రొవిజినల్ జాబితా జారీ తేది	09/07/2026
12	ప్రొవిజినల్ జాబితా అభ్యంతరాలను సమర్పించుటకు చివరి తేది	14/07/2026
13	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారుల తుది జాబితా జారీచేయు తేది	24/07/2026
14	నిర్ణీత రిజల్యూషన్ దరఖాస్తుదారులకు రిజల్యూషన్ ప్లాన్ కొరకు ఇన్ఫర్మేషన్ మెమోరాండం, ఎవల్యూయేషన్ మ్యాట్రిక్స్ & అభ్యర్థన జారీతేది	29/07/2026
15	రిజల్యూషన్ ప్లాన్స్ సమర్పించుటకు చివరి తేది	28/08/2026
16	ఆసక్తి వ్యక్తీకరణను దాఖలుకు ప్రాసెస్ ఇమెయిల్ ఐడి	cirp.vivimedlabslimited@hotmail.com

తేదీ: జూన్ 14, 2026
ప్రదేశం: బెంగళూరు
సం/-
టి నారాయణ స్వామి
ఇంటిరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg. No.: IBBI/IPA-002/IP-N01078/2020-2021/13427
నమోదిత చిరునామా: నెం.15, శుభదీప, 7వ క్రాస్, భువనేశ్వరి నగర్, హెబ్బల్ కెంపపుర, బెంగళూరు నార్త్, శక్తి గణపతి దేవాలయం దగ్గర, బెంగళూరు, కర్ణాటక - 560024
వివిమెడ్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున